వరలక్ష్మీ వ్రతం

ఇరుగుపొరుగులను ప్రేమించడం, మధ్య ఇంట్లో కాపురం ఉన్నవారి విధ్యుక్త ధర్మం. పెద్దల మాటలపట్ల గురి గౌరవం ఉన్న విశ్వేశ్వరరావు పొరుగింట కొత్తగా దిగిన సూర్యనారాయణగారి సుపుత్రి గాయత్రిని ప్రేమించాడు ఆమె మేడమీది గది కేటాయించుకుందని తెలియగానే, విశ్వేశ్వరరావు పిన్నికీ మా బాబాయికీ నచ్చచెప్పి బతిమాలి తనూ తమ మేడమీది గదిలోకి మారాడు.

పొరుగింటి పంచకల్యాణి ఆమర్నాటికే పైనించి కొంపు ఎత్తేసి, కింద గదిలోకి మారిపోయింది. చదువు మానేసిన గాయత్రికి ఉజ్జీగా తనూ తన గదులు మార్చడంకోసం తలనొప్పి, జ్వరం, కుడిచేయి కొద్దిగా తెగుట, కాలిబొటనవ్రేలికి దెబ్బతగులుట మొదలైన కారణాలు వర్ణించి, విశ్వం ఆఫీసుకి సెలవు పెట్టడం కూడా జరిగింది. అహర్నిశలూ గాయత్రీ జపించినా ఫలితం లేకపోయింది.

గాయత్రి ఇంటికి వస్తుంది. పిన్నితో కబుర్లాడుతుంది తన భోగట్టా శ్రద్ధగానే వింటున్నట్లు కనబడుతుంది. అయినా తను కిటికీలోంచి చూచినపుడు, తిరస్కార భావం కనబడేది ఆమె మొహంలో. ఒక్కొక్కసారి తనని చూసి నవ్వుతున్నట్లు కనిపించింది పిన్ని దగ్గిర హేళనగా మాట్లాడినట్లు అనిపించింది.

ఒకానొక ముహూర్తాన తన ఊహాలు నిజమేనని నిర్ధారణగా తోచింది విశ్వేశ్వరరావుకి. ఉత్తర క్షణాన, "ఈ పిల్ల నెలాగైనా పెళ్ళాడుతాను" అని ఒట్టుపెట్టుకున్నాడు.

అయినా గాయత్రి ప్రసన్నకాలేదు.

* * *

శ్రీ రామ పఠన మందిరంలో కూర్చుని పత్రికవంక దీక్షగా చూస్తున్న విశ్వేశ్వరరావు పక్కనే ఒక జోగినాథం చేరాడు. అతనుకూడా పత్రికలోకి తొంగితొంగిచూసి చదువుతున్నాడు. ఆ పేజీ అయిపోయింది. పక్క పేజీ చూడాలి. ఎంతసేపటికీ విశ్వం పేజీ త్రిప్పడాయె, జోగినాథం చొరవచేసి పేజీ తిప్పాడు. విశ్వం విసుక్కోలేదు, మేనర్సు లేవా అని గసరలేదు.

జోగినాథానికి కుతూహలం కలిగింది. పేపరు లాక్కుంటున్నా గసిరికొట్టకపోవడానికి కారణం ఏమిటా అనిపించింది. అంత విరక్తి దేనికో అనిపించింది.

"ఏమిటోయ్ విసినాథం? అలా ఉన్నావూ?" అన్నాడు.

అసలు సిసలు సినిమా హీరోలా అతి మెల్లిగా తలఎత్తి కుడివైపుకి తిప్పి బాధగా చూశాడు విశ్వం.

"ఆర్పేవాడివా తీర్చేవాడివా?" అన్నాడు విసుగ్గా.

"ఆరుస్తాను, తీరుస్తాను. నీకొచ్చిన కష్టం చెప్పవోయ్" అన్నాడు జోగినాథం.

"అయితే చెబుతా పట్టు. ఏ మాత్రం సాయం చేస్తావో"

"పూజా పురస్కారాలు లేక బూజుపట్టి ఉన్నానుగాని, నైవేద్యం పెట్టు మరి నా మహిమ చూపిస్తాను" అన్నాడు జోగినాథం హుషారుగా.

ఉదయం తొమ్మిది వేళారు. విశ్వం ఒక్కక్షణం ఆలోచించి, జ్వరం వచ్చిందని సెలవు చీటిరాసి, ఆఫీసుకు పంపేశాడు. తరవాత జోగినాథాన్ని వెంటబెట్టుకొని, నైవేద్యం పెట్టడానికి బయల్దేరాడు.

* * *

ఫలహారాల అనంతరం, ఆత్మకథను నివేదించాడు విశ్వం.

"పంతులూ - 'గాయత్రీ' జపం ఏంపని చెయ్యదు. నువ్వు రేపట్నించే సూర్యనమస్కారాలు ప్రారంభించాలి" అని తూచి తూచి సలహా చెప్పాడు జోగినాథం—

విశ్వం చప్పగా నవ్వాడు.

"అయినా కాకపోయినా సూర్యనారాయణగారు నిన్ననే చెన్నపట్టణం వెళ్లారు. 15 రోజులవరకూ రారట"

జోగినాథం ఊహాలకి బ్రేకుపడింది. ఇంకో సిగరెట్టు ముట్టించాడు "మీ గాయత్రి అమ్మగారి పేరేమిటో తెలుసా?"

"వరలక్ష్మమ్మగారు"

"రైటో. శ్రావణమాసం సగం గడిచిపోయింది. పోతేపోయిందిలే కాని నువ్వు రేపటినించీ వరలక్ష్మీవ్రతం చెయ్యి. మీ మావగారు రాగానే సూర్యనమస్కారాలు ప్రారంభించు. ఆపైన నే చెప్పిన రోజున ఉద్యాపన చేసుకుందువుగాని" అన్నాడు జోగినాథం ధీమాగా.

'సరే' అన్నాడు విశ్వం నీరసంగా.

"మరేం భయంలేదు భక్తిప్రపత్తులతో వ్రతం ఆరంభించి, ఆవిడ వాత్సల్యాన్ని సంపాదించు. ప్రసన్నురాలుగా చేసుకో" అని జోగినాథం, విశ్వానికి వరలక్ష్మీవ్రత విధానం ఉపదేశించి, ఇంకో సిగరెట్టు పుచ్చుకొన్నాడు.

"పెద్దలను ఖాతరు చేయకుండా, ముఖాముఖి ప్రేమించి పెళ్ళాడబోయిన ఆసాములు అట్టే మంది నెగ్గుకొచ్చినట్టు గాధలలో కనబడదు దక్కామొక్కీలు బోలెడు తిన్నవాణ్ణి నేనూ ఎరగను అందుకని 'అన్యథా శరణం నాస్తి' అని నమ్మి మరీ వ్రతం చెయ్యి" అని హెచ్చరించి, మిగతా సిగరెట్లు తీసుకున్నాడు జోగినాథం.

* * *

విశ్వేశ్వరరావు, గురూపదేశాను సారం, మర్నాడు సూర్యోదయాత్పూర్వమే నిద్రలేచాడు. ప్రకృతి తెల్లగా, చల్లగా, చక్కగా కనబడింది. "ఓహో పొద్దున్నే లేస్తే ప్రకృతి సౌందర్యం ఆస్వాదించవచ్చు కాబోలు" అనుకున్నాడు వీధులోకి వెళ్ళి చూశాడు 'గాయత్రి' గుమ్మం కడిగి పసుపు కుంకం పెడుతూంది గాయత్రి, అభినేత్రి, సావిత్రి, రచయిత్రి, కవయిత్రి అని గబగబా అనుకున్నాడు. కాఫీ త్రాగి సైకిలెక్కి, గోదావరి ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామి కోవెలకు వెళ్లాడు. పూజారిగారికో నమస్కారం పెట్టి, కోవెల ఆవరణలో పువ్వులు కోసుకున్నాడు. చకచక ఇంటికి చక్కా వచ్చి, పిన్నికి నాలుగు పువ్వులిచ్చి పెరట్లోకి వెళ్ళాడు. వరలక్ష్మమ్మగారు పెరట్లో ఉన్న మందార, నందివర్ధనం కోసుకుంటోంది 'పువ్వులు కావాలా' అండి అనేశాడు సాహసించి.

వరలక్ష్మమ్మగారు మురిసిపోయింది పువ్వులందుకుంటూ 'శీఘ్రమేవ కల్యాణప్రాప్తిరస్తు' అని ఆశీర్వదించింది చనువుగా.

విశ్వం సిగ్గుపడిపోయాడు.

రచన

"ఏరా. విశ్వం. ఏం కథ. కొంపతీసి సంధ్యావందనం కూడా చేస్తావేమిటి?" అన్నాడు వాళ్ళ బాబాయ్. బాబాయి పక్కన నవ్వాడు.

"అక్కడికి రోజూ సంధ్య వార్చినట్లు" అన్నాడు విశ్వం సాధ్యమైనంత గట్టిగా. బాబాయిని సావిట్లోకి వెళ్ళనిచ్చి పిన్నిని బ్రతిమాలుకున్నాడు విశ్వం. సంధ్యావందనం సంగతి దండోరా వేయించవద్దని.

"ఒరేయ్. సంధ్యవారుస్తున్నట్లు తెలిస్తే కాలేజీ పిల్లలెవరూ ఎదురుకట్నం ఇచ్చినా పెళ్ళాడరుసుమా" అందావిడ నవ్వుతూ.

"మరేం ఫరవాలేదు. ఇంటర్ ఫెయిలయినవాళ్లు చాలు. అసలయినా ఇపుడు పెళ్లి గోడవెందుకు? అన్నాడు విశ్వం.

"మరే నాయనా. ఏడుమల్లెపూల ఎత్తు రాజకుమారిని, ఎంత చక్కనిదాన్ని వరిస్తావో చూస్తాంగా" అంది పిన్ని.

*　　　*　　　*

భారతం, భాగవతం, రామాయణం, స్త్రీల వ్రతకథలూ, మొదలైన మంచి పుస్తకాలన్నీ ఎక్కడెక్కడి నించో పట్టుకొచ్చి, వరలక్ష్మమ్మగారికి ఇచ్చేవాడు విశ్వనాథం. రోజూ తెల్లవారే సరికి పూలసజ్జ నిండా పువ్వులు కోసుకువచ్చి అందించేవాడు.

శుక్రవారంనాడు విశ్వేశ్వరరావుకి అధికారరీత్యా కాలుకి పెద్దదెబ్బ తగిలినందువల్ల ఆఫీసుకి సెలవు పెట్టవలసివచ్చింది.

ఆ నాడు వ్రతం అయినందువల్ల అతను తొలికోడితో మేలుకుని, కాకితో పడున్నాడు.

"ఆయన ఊళ్ళో లేనందుకు, ఈ అబ్బాయి లేకపోతే, వ్రతం, పేరంటం ఎంత అభాసయిపోను" అని వరలక్ష్మమ్మగారు ఊహు ఇదైపోయి పదేపదే ఆ ముక్క అంటూ వచ్చింది. విశ్వం మురిసిపోయి, పరుగున జోగినాథం దగ్గరకు వెళ్లి చెప్పాడు.

"భేష్. కథ దారిన పడింది. కానీ" అని వీపు తట్టాడు జోగినాథం.

*　　　*　　　*

గాయత్రి హిందీ చదువుతోందిట.

"బుధవారం పరీక్షట బాబూ. కాస్త శ్రమనుకోక, ఇవాళా రేపూ దానికి రెండు ముక్కలు చెబుదూ, నాయనా్నయన" అని ప్రాధేయపడింది వరలక్ష్మమ్మగారు.

"ఎంతమాట, తప్పకుండా." అన్నాడు విశ్వం.

"నీకొచ్చిన ఇంతోటి పాండిత్యానికీ ట్యూషనే చెప్పగలవురా! పైగా ఆఫీసు లేదు?" అంది పిన్ని.

"మరేం ఫరవాలేదు రేపూ ఎల్లుండీ అంపకంపాలతో ఊష్టం ఒచ్చేస్తుంది లే." అన్నాడు విశ్వం.

మర్నాడు పదిన్నరకి ఆఫీసు నుంచి కబురొచ్చింది అర్జెంటుగా రమ్మని. అప్పటికి గాయత్రికి పాఠం చెబుతున్న హడావుడిలో, జ్వరం సంగతి మర్చిపోయి విశ్వం ఆఫీసుకి వెళ్ళాడు.

"ఏదీ జర్వం?" అన్నారు ఇంటిగారు పక్కన నవ్వి. తనంటే ఆయనకి అభిమానమని విశ్వానికి తెలుసు.

"జ్వరం కదండి. వచ్చే వేళయిందండి. నిన్న ఆదివారం పదకొండింటికి వచ్చిందండి. మళ్ళీ ఇవాళా..." అనినసిగాడు.

"అబ్బాయ్. ఇకేంకుదరదు. ఇకనుంచి నీకు రెణ్ణెల్లకోసారి తప్ప జ్వరం రాకూడదు ఐదార్నెల్లకొకసారే కాలు విరగ్గొట్టుకోవాలి... నెలకోసారి చెయ్యి తెగ్గొట్టుకో వచ్చు. తలనొప్పి ఎంత జోరుగావచ్చినా పొద్దుట పదకొండులోగా పోయితీరాలి. పెద్ద పెద్ద ఖాయిలాలు అసలు వల్లకాదు. ఏడాదికి ఓసారి వచ్చినా 15 రోజుల్లో పోవాలి" అన్నాడాయన తలవంచుకుని ఏదో రాసుకుంటూ.

"అలాగేనండి, ఇవాళా రేపూ మాత్రం జ్వరం రానివ్వండి" అన్నాడు విశ్వం సెలవు తీసుకుంటూ.

*　　　*　　　*

శ్రావణమాసం, దానితోపాటు, విశ్వం వరలక్ష్మీవ్రతం పూర్తికావచ్చాయి. పొరుగింటివారింట చారు ఘుమ ఘుమలాడినట్లు, పిన్ని కాచినచారు ఘుమ ఘుమలాడదని విశ్వం అనేకసార్లు ఘంకామీద దెబ్బకొట్టినట్లు చెప్పాడు. ఓసారి కాస్త జరంవచ్చినపుడు, వాళ్లింట్లో చారుకావాలని పోరి తెప్పించుకుని సేవించి, మర్నాడు అనర్గళంగా ఆచారు రుచులను పొగిడాడు.

చెన్నాపట్టంనించిసూర్యనారాయణగారు వచ్చిన మర్నాటి ఉదయమే విశ్వేశ్వరరావు సూర్యనమస్కారాలు కూడా ప్రారంభించాడు.

పీఠయుగుమీద కూర్చొని దంతధావనం చేస్తున్న ఆ సూర్యనారాయణగారు, హఠాత్తుగా ఈ నమస్కారంచూసి హడలిపోయి లోపలికి పరుగెత్తాడు.

"జానే ఇలారా. వాళ్లబ్బాయి నాకు దండంపెట్టాడెందుకు?" అని అడిగేశాడు ఖచ్చితంగా.

"హాయ్యో రాత: రాయుచ్చుకు కొట్టినట్లు చెప్పొచ్చారే. ఆ పిల్లాడిసంగతి మీకేం తెలుసు? ఎంత ఒద్దికా...ఎంత వినయం... ఏంవందనం. అలాంటి పిల్లాడు గర్భవాసాన పుట్టడానికి ఆ తల్లి ఏంనోచిందో" అంటూ ఆవిడ అదే ఇదిగా చెప్పుకుపోయింది.

*　　　*　　　*

జోగినాథం చాలా మెచ్చుకున్నాడు విశ్వం అదృష్టానికి. 'పంతులూ కథ ముగిసినట్టె. ఇంకేంలేదు చిన్న ఉద్యాపన ఉంది. అది కాస్తాచేస్తిమా, ని నోము పండిందే. అయితే ఒక్కసంగతి..."

"ఫరవాలేదు. ఎంతో చెప్పు" అన్నాడు విశ్వం హుషారుగా.

"దానాదీనా తడిసి మోపెడవుతుంది కాని, పాతికలో సర్దేస్తాను."

"రైటో. ఉద్యాపన ఏమిటో చెప్పు."

జోగినాథం చెప్పాడు.

విశ్వం, ఏడిసినట్టుందన్నాడు.

జోగినాథం నీమొహం, నీకు తెలీదు అన్నాడు.

విశ్వం రైటో అన్నాడు.

ఉద్యాపనకి శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సాయంత్రం ముహూర్తం పెట్టారు. లక్ష్మీవారం సాయంకాలం విశ్వం పెరట్లో పిట్టగోడకి చేరబడినించుని, పిన్నితో 'నేటి సమాజంలో సంస్కరణలు' అను విషయంపై విజ్ఞాన చర్చజరిపాడు. వరలక్ష్మమ్మగారు తులసిమొక్కకి పూజచేయడానికి రావడం చూసి, వరకట్నాలు ఎంతదారుణమో, కావాలనేవారు ఎంతరాక్షసులో ధాటీగా ఉపన్యసించాడు.

ఉచితం! ఉచితం!! ఉచితం!!!

ప్రెసిడెంట్ స్నో కొనే ప్రతి ఒక్కరికి ప్రఖ్యాత ఫిల్మ్‌తార బొమ్మగల అందమైన 1956 క్యాలెండరు ఉచితముగా యివ్వబడును.

మీ డీలరును అడగండి.

తయారు చేయువారు:

రథోడ్ ట్రేడింగ్ కంపెనీ

సౌకార్ పేట - మద్రాసు-1.

★ వరలక్ష్మి వ్రతం ★

'ఔరా ఏమిగొప్పహృదయం' అని ముక్కుమీదవేలేసుకు మరీ ఆశ్చర్యపడింది వరలక్ష్మమ్మగారు. గాయత్రి ముసిముసి నవ్వులునవ్వుతోన్నదల్లా పక్కనున్న ఇంట్లోకి వెళ్లిపోయింది.

"ఇంకా పేళ్లనేనా" అనుకుని కంఠశోషకు ఉసూరుమంటూ, మేడమీదకి వెళ్లిపోయాడు విశ్వం. మర్నాడుసాయంత్రం మసకసంధ్య వేళ, పిన్ని వరలక్ష్మమ్మగారింటికివెళ్లి, తాంబూలం పుచ్చుకువచ్చింది.

వేసుకున్న పథకం అమలుజరుగడానికి ఐదునిముషాలుకూడా వ్యవధి లేనందువల్ల, విశ్వం పెరట్లోనే విహరిస్తున్నాడు.

"ఒరేయ్ విస్సీ ఇలారా." అంది పిన్ని వంటింట్లో పీట వేసి.

విశ్వం వెళ్లాడు.

"నామీద నీకు గౌరవముంటే చెప్పినట్లు విని, వాళ్ల గాయత్రిని చేసుకో" అంది.

విశ్వం నోరుతెరచి అట్టే కొయ్యబారిపోయాడు.

"వినకపోతే నీఖర్మం. లక్షణమైనపిల్ల, బుద్ధిమంతురాలు నెవళీకంఉంది. ఆయనా అవిడాకూడా నిన్నుచూచి ఎంతో ముచ్చట పడుతున్నారు. "అతనికి గినాకట్నం పుచ్చుకోకూడదని పట్టింపుఉంటే, అదేదో మరోవిధాన ముట్టచెబుతాం" అని బతిమాలారు. ఇష్టమైతేచెప్పు. ఆయన రాత్రికి రైలుకి వెళ్లిపోతున్నారు. నువ్వు 'ఊ' అంటే ఈ ముల్లె రాగానే పెళ్లేసన్నారు. అన్నట్టు, అసలుసంగతి మర్చిపోయాను. అలాఉంది గాని, ఆపిల్లకి నువ్వంటే పంచప్రాణాలూనూ ఇందాక నావదకే, సిగ్గువిడిచి చెప్పిందికూడా. అలాటి లక్ష్మి నీకు వెయ్యి జన్మలెత్తినా దొరకదు. ఊ అనరాబాబూ" అందావిడ.

కొయ్యబారిన విశ్వేశ్వరరావు అతికష్టం మీద 'ఊ' అన్నాడు.

పిన్ని సంతోషంతో లేచి, పొరుగింటికి వెళ్ళబోయింది. ఎవరో వీధి తలుపుతట్టారు. 'వచ్చే వచ్చే!' అంటూ విశ్వంవంక చూచి అవతే వెళ్లింది తలుపుతీయడానికి.

అంతలోనే పెరట్లో చప్పుడైంది. 'కొంప మునిగింది. అయినా ఇంతలేటుగా చెబితే ఎలా. జోగినాథం ఉద్యాపన కొచ్చాడు కాబోలు' అన్నాడు విశ్వం గట్టిగానే. అంటూనే లేచి పెరట్లో కెళ్లాడు.

"అయ్యో! అయ్యో దొంగ దొంగ" అంటూ వరలక్ష్మమ్మగారు, ఆమెభర్త గాయత్రి పెరట్లోకొచ్చారు. విశ్వం చెంగున గోడదూకి అటు వెళ్లాడు.

పారిపోతున్న ఆదొంగ పెరటిగుమ్మం దగ్గిర రాయితగిలి బోర్లగిలా పడ్డాడు.

'త్వరగా లేచిపో' అన్నాడు విశ్వం దొంగదగ్గరకెళ్లి. అంతలోనే వరలక్ష్మమ్మగారు, ఆమె భర్త వచ్చేయడంతో గుట్టు బయటపడుతుందని విశ్వం తెగించాడు. లేచి పారిపోబోతున్న జోగినాథం రెక్కపట్టుకుని లేపాడు.

"దొంగ వెధవా? ఎక్కడికి పోతావ్" అని గద్దించాడు చేతనయినంత కోపంగా.

"కనిష్టీపుల్ని? పిలుస్తా ఉండు" అన్నాడు సూర్యనారాయణగారు.

విశ్వానికి ప్రాణం పైనించి లేచిపోయింది. 'అబ్బెబ్బే వద్దండి మనవాడే... ఐమీన్...మనమే చిదగ్గొట్టి పంపేద్దాం శుక్రవారం పూటా ఒకమానవుణ్ణి జైలుకు పంపటం ఎందుకు" అన్నాడు.

"అవెధవేం చేశాడో నీకు తెలుసా బాబూ మాలక్ష్మికి నేను వేసిన నెక్లెసు తీస్తున్నాడు. అంతలో నేను వచ్చి అట్టే అన్నాను. ఒక్కక్షణం ఆలస్యమయితే... ఇంకేమన్నా ఉందా"

"అంతే లెండి పిన్నిగారు_ఐమీన్ అత్తయ్యా. అయినా వదిలేద్దాం పోలీసుల గోల మనకెందుకు. మనమే...నేనే తన్నేస్తా" అన్నాడు విశ్వం గంభీరంగా.

"వెధవని డొక్క వాలికట్టేసి మరీ వదలు బాబూ" అన్నారు సూర్యనారాయణగారు గోచీ బిగించుకుంటూ.

వ్రతం చెడ్డా ఫలందక్కాలి ఇప్పుడు వ్రతం ముగిసే లోగానే ఫలం దక్కింది. జోగినాథం దొంగతనం చేయబోవడం. తను అడ్డుపడి, ఆ 'దొంగ'ని తరిమివేసి అత్తగారి మెప్పులందుకోవడం ఈవ్రతానికి ఉద్యాపన, ఇప్పుడు గనక ఈఉద్యాపన చెడితే గుట్టు రట్టుఅవుతుంది. కథ చెడిసికొడుతుంది. ఫలం నిష్ఫలం అవుతుంది.

"జోగినాథం! నన్ను క్షమించు" అని మనసారా అనుకుని, చుట్టూ ఉన్నవారికి అనుమానం కలగకుండా ఉండగలందులకు గాను, అంతకన్న మనసారా జోగినాథం జుట్టు పట్టుకొని వీపుబద్దలయేలా బాదాడు విశ్వం. దెబ్బదెబ్బకీ ఐదూ పదీ, పదిహేను చొప్పున పరిహారం ఇచ్చుకుంటానని సాంకేతిక భాషలో చెబుతూనే వాస్తవికత ఉట్టిపడేట్లు అభినయించడానికై, జోగినాథం చెంపలుకూడా వాయగొట్టాడు. ★

అసలు సంగతి

పెళ్ళిసంబంధం కుదిరింది. తాంబూలాలు పుచ్చుకున్న తరువాత, పెళ్ళికొడుకుతో, కాబోయే బావమరది కబుర్లు మొదలుపెట్టాడు.

"మీకు ఉమర్ ఖయాం ఇష్టమేనా?" అన్నాడు.

పెళ్ళికొడుకు కాస్త ఆలోచించాడు. "నా కంత నచ్చదండి. జహంగీర్ పాద్షా అలీ మామూలుగా తింటాను. అయినా పేర్లు వేరుతప్ప అన్నీ తీపే" అని ఫెళ్లున నవ్వాడు.

ఇంటికి వెళ్ళిపోతున్నపుడు పెళ్లికొడుకు పెద్దన్నయ్య మందలించాడు. "వెధవా తెలీకపోతే తెలీదని చెప్పెయ్యరాదు. ఉమర్ ఖయం అంటే జిలేబీలాటి మిఠాయను కున్నావు కాబోలు. అది ఉత్తరాదివాళ్లు న్యిమ్మకాయ మసాలా వేసి చేసే బటాణీలతో చేసే వంటకాన్ని ఉమర్ ఖయ్యాం అంటారు."

మంచీ - చెడూ

వెల 2-0-0

పోస్టుఖర్చు ప్రత్యేకం

ఆంధ్రగ్రంథమాల,

మద్రాసు-1.